కొత్తగడ్డ

చంద్రమౌళి

వహీదాలీ రోడ్డుచివర కనిపించాడు. రెల్లుగడ్డి గుడిసెలముందు అరుగులమీద కూర్చొన్న భర్తలతో సాంసారిక విషయాలు మాట్లాడుతున్న వెంకమ్మలూ, సీతమ్మలూ, లోపలికి వెళ్ళిపోయారు. వాళ్ళ భర్తలు లేచి క్రిందకు దిగి నిల్చున్నారు. వహీదాలీ ఒక్కొక్క యిల్లూ దాటుతున్నపుడు యింటి యజమానులు 'సలామా లేఖుం'లు కొడుతున్నారు. వహీదాలీ—కాదు, జనాబ్ వహీదాలీ మింటివంకకు చూస్తూ ఉదయ భాస్కరుకన్న మిడిసిపడుతున్నాడు. ఐతే తన నెత్తిమీది తురకటోపీ లేకపోతే—ఆ ఉదయభానుని తీక్ష్ణ వీక్షణాలకు దడిసి పారిపోవలసి వచ్చేదన్న సంగతి మరిచిపోయాడు. ఆ ఊరికే మకుటం లేని మహారాజాయె మరి.

* * *

హైదరాబాదులో పోలీస్ యాక్షన్ జరగక మునుపు రోజులవి. అది నిజామాబాదుజిల్లాలో ఓ కుగ్రామం. అంతా కలిసినా వందకొంపలుండవ్. ఇళ్ళన్నీ గాలిచొరకుండా, వెలుతురు ప్రాంగణంలో అడుగు పెట్టడానికి వీలు లేకుండా నిర్మించబడినవి. కప్పుకు సిమెంటు శ్లాబులో పెంకులో ఉపయోగించబడినై. ఆ ఊరిలోకల్లా జనాబ్ వహీదాలీగారిదీ, పటేల్ జనార్దనరెడ్డిగారివీ చిన్న డాబాలు. వాటి చుట్టూ పట్నంలో (హైదరాబాదులో) మాదిరిగా చిన్న చిన్న బగీచాలున్నై. అంతకుమించి వేరే వాటిని యిళ్ళనటం యేమంత సబబుగాదు. కోతులు కొల్లలు గావటాన యింటి కప్పుమీద ముళ్ళకంప లుంచబడినై. గట్టిగా గాలివాన కురిస్తే పడిపోయేలాంటివి. ఏ పని జరిగినా జనార్దనరెడ్డీ వహీదాలీగార్ల ఆమోదముద్రపడనిది జరిగేది లేదు. వారిద్దరూ బజారున నడుస్తుంటే అంతా లేచి నిల్చోవాలి. సలాములు కొట్టాలి అది తరతరాలా వస్తున్న ఆచారం. అది జరగని నాడు—దాన్ని ఎవరైనా ఉల్లంఘించిననాడు—వాడు దండనార్హుడు "దొరా నేను నీబానిసోణ్ణన్నా" లాభంలేదు. జుల్మానా చెల్లించక తప్పదు కూడాను.

వహీదాలీ వెళ్ళిన తరువాత లేచిన వాళ్ళంతా కూర్చోనారంభించారు. తలుపుచాటునుంచి బయటకు వచ్చిన భార్యల చూపులు 'ఏమిటీబానిసత్వం' అంటున్నట్లున్నై. భద్రయ్య ప్రక్కింటిశోభనాద్రిని దగ్గరకు పిలిచాడు. ఊరుబయట అసలు ఊరునానుకొని వేసుకొన్న పదియిళ్లూ యీ బజారు. అసలు ఊరికీ యీ పదిళ్ళకు యెంతో తేడా కనిపిస్తుంది. ఇళ్ళముందు శుభ్రంగా అలికి ముగ్గులు పెట్టున్నై. ఏమిటిబాబాయ్ అంటూ దగ్గరకొచ్చాడు శోభనాద్రి. శోభనాద్రిదీ భద్రయ్యదీ కృష్ణా జిల్లాలో చిన్న పల్లెటూరు. నిజాం రాజ్యంలో భూములు చౌక. ఇద్దరివంశం పూర్వం బాగా కలిగినవాళ్ళదే. తాతలనాటినుంచీ కొంచెం ఆర్థికంగా పలుచబడినై కుటుంబాలు. శోభనాద్రీ వాళ్ళన్నలూ పంచుకొనేటప్పటికి అతనికి మిగిలిందల్లా ఓకుంట. రెక్కలాడితేగాని డొక్కలాడని సంసారం. భార్య కాపురానికి వచ్చిన రెండు సంవత్సరాలకే యిద్దరు కూతుళ్ళు కలిగారు. సంసారం గడవటం కష్టమనిపించింది.

కూలిదొరకటం అనూహ్యం. అలాంటిశోభనాద్రికి బెజవాడ వెళ్ళివచ్చిన భద్రయ్య ఉన్నట్టుగారమ్మని కబురంపాడు. "శోభనాద్రీ! నువ్వు పిల్లలుగలవాడివి. బాధపడుతున్నావ్. చూడబోతే నాకూ అంతఆస్తిలేదు. ఐన బంధువులలో తలెత్తుకు తిరిగేట్టులేదు. ఎంతకష్టపడ్డా సంవత్సరానికి వందరూపాయలు మిగిలేటప్పటికి పెటపెటలాడుతుంది. నీదీ పిల్లలుగల సంసారమేగా? నిజామాబాదుజిల్లాలో భూములు చౌకట. గుంటూరు జిల్లావాళ్లు చాలామంది అక్కడకు వలస వెళ్తున్నారు. ఎకరం రెండొందలు. నీకుంట అమ్ముకొన్నావంటే కనీసం పదెకరాలు కొనుక్కోవచ్చు. బాగా ఆలోచించుకో—తరువాత మథనపడి లాభం లేదు. చెరుకుబాగా

అవుతుందంటున్నారు. నేనొక్కడినే వెళ్ళిపోదామంటే మనసవటంలేదు. చిన్నప్పటినుంచీ నీవంటే నాకభిమానం" అన్నాడు భద్రయ్య.

శోభనాద్రి కళ్ళు మిలమిలలాడినై. తను పదెకరాల ఆసామీ కాబోతున్నాడు. తను కలలోకూడా తలచని విషయం. అలాంటిది. అతని ముఖం చేటంతైంది. సిరిరా మోకాలొడ్డేవాడుంటాడా? "అలాగే బాబాయ్! నువ్వంతగా నైజామేమిటి నడిసముద్రంలో దూకమంటే దూకుతా" అన్నాడు. "బాగా ఆలోచించుకొని సాయంత్రం కనబడు. తరువాత తేమనుకొనీ లాభంలేదు. ఎంత చెడ్డా ఉన్న ఊరూ-పుట్టి పెరిగిన ఊరూ వదిలి క్రొత్తగడ్డ త్రొక్కడం సాహసంతో కూడుకొన్న పని" అన్నాడు భద్రయ్య. శోభనాద్రికి పగలల్లా పని తెమలలే . పొలంగట్టు విరిపించాల్సిన పనున్నది. మినుములు కొట్టించగా రెండు బస్తాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నై. బేరం యివ్వాలి, ప్రక్క ఊళ్ళో పెద్దకూతురికి సంబంధం చూద్దామనుకొన్నాడు. చెయ్యాడలేదు అటూ-ఇటూ ఊరికే తిరిగాడు. తన పెద్దన్న చిన్నన్నలతో సంబంధ బాంధవ్యాలేనాడో తెగిపోయినై. మూడోవాడు గుంటూరు జిల్లాలో అత్తగారి ఊళ్ళోనే స్థిరపడిపోయాడు. పెళ్లాంతో మాత్రం తను చేయబోతున్న సాహస కార్యాన్నిగురించి ముచ్చటించాడు. సీతమ్మ ప్రోత్సాహకరంగా మాట్లాడలేదు. ఈ ఆడవాళ్ళంతా పిరికిపందలు, సనాతనులు, పురోగమించటం నేర్వని పరమ ఛాందసులనుకున్నాడు. ప్రొద్దు పడమటికి తిరగంగానే పొలంవైపుకు వెళ్ళి వచ్చాడు. ఊళ్లో అడుగు పెట్టేటప్పటికింకా చీకటి పడలేదు. అరుగుమీద కూర్చొన్న మునసబు మల్లయ్య, "ఏరోయ్ శోభనాద్రీ యిలా రా" అన్నాడు. ఆయన ప్రక్కన కరణంగారు కూడా కూర్చొనున్నారు. యెట్టివాడు రోడ్డుమీద చతికిల బడున్నాడు. మునసబుగారు వయసులో పెద్దవాడు. ఆయనమీద ఊళ్ళో అందరికీ అపరిమితమైన గౌరవం-ఆదరాభిమానాలు. "ఏరా శోభనాద్రీ! పొలం బేరం పెట్టావుటగా" అన్నాడాయన, శోభనాద్రిని దగ్గరకు రానిచ్చి.

శోభనాద్రికి యేం సమాధానం చెప్పటానికీ తోచలేదు. ఈ విషయం ఐదు గంటల క్రితమే తాననుకొన్నది. అప్పుడే ఆయనకెలా తెల్సిందో-దగ్గటానికి ప్రయత్నించి ఆపేశాడు శోభనాద్రి. "ఏం లేదు మామా. నైజాంలో పొలం తక్కువ ధరకు గిట్టుబాటౌతుందంటే పోనీ". "పోరా పిచ్చిసన్నాసీ మాటల్లో ఉన్నంతరంజు—చేతల్లో ఉందిట్రా. కొత్తగ. తొక్కాలమంటే చెత్తగడ్డి తినాల్సిందే. ఐనా యివన్నీ యెందుకురా—నైజాంభూమి మన మెరుగందిట్రా. వట్టి సన్నాసిదైతేను. దారినిపోయే శనిని యింట్లో తెచ్చుకోవటంగాక" అన్నాడు మునసబుగారు. "భద్రయ్య ప్రయోజకత్వం ఎవరికి తెలీదురా? అయిచ్చిపోయిన పదెకరాలూ—ఐదుకు తెచ్చాడు. వ్యవసాయమంటే—నాటకాలాడటం - భోగమాళ్ళతో కులకటంట్రా—భద్రయ్యమీద భరోసా వేయటానికి వాడేమన్నా బెత్తెడు నేల దున్నెరుగునా. ఏమన్నానా?" ఐనా నీయిష్టం ముసలిముండాకొడుకని—నోరూరుకోక యేదో—"సగంలో ఆపేశారాయన. శోభనాద్రి వెళ్ళొస్తానని బయలుదేరాడు. మనసులో ద్వంద్వం తెమలటంలేదు. ఏ ప్రక్కకు మొగ్గాలి. భద్రయ్య చెప్పినదాంట్లోని ఆశ సూదంటురాయిలా తనని ఆకర్షిస్తున్నది. మల్లయ్య చెప్పినది బొత్తిగా కొట్టివేయ తగ్గట్టుగా లేదు. ఆరోజల్లా ఆలోచిస్తూనే ఉన్నాడు. తెల్లవారకట్లకొంచెం కునుకుపట్టింది. బాగా యెండెక్కి లేస్తూ—యేమున్నా గాని భద్రయ్యనీడనే పోవాలనుకొన్నాడు. సాయంత్రానికల్లా కుంటా—చెకాబెకా అమ్మేశాడు. మల్లయ్య కొన్నాడు. మరునాడే రిజిష్ట్రేషన్ జరిగింది. డబ్బులెక్కపెట్టేస్తూ నామాట పెట్టేశావు. పోనీ యెక్కడున్నా బాగుపడితే నేనూ సంతోషిస్తా" అన్నాడు మునసబు.

* * *

రెండు నెలల తర్వాత యీ కుగ్రామంలో భద్రయ్య పదెకరాలఖండాలు ఐదుఖండాలు కొన్నాడు. శోభనాద్రి ప కరాలఖండం కొన్నాడు. ఎకరం రెండొందలకాడికి పైసలు చేసుకొన్నారు. వీళ్ళకన్నముందుగానే గుంటూరుజిల్లానుంచి ఒకటిరెండు కుటుంబాలొచ్చునై. ఊరిబయటంతా స్థలంకొనుక్కొని యిటుకలతో గోడలు లేపి—రెండునిట్టాళ్ల పాకలు వేసుకొన్నారు. సంసారాలతోవచ్చి స్థిరపడిపోయేటప్పటికి రెండు నెలలు పట్టింది. ఊళ్లోవాళ్ళకు వీళ్ళకు తెలిసినవ్యవసాయపుపద్ధతులేవీ తెలియవు. జనార్దనరెడ్డి, జనాబ్ వహీదాలీ దగ్గరనుంచి సామాన్యునివరకూ ముప్పూటలా యీతకల్లు సేవించాల్సిందే. ఆ చుట్టు

ప్రక్కలెక్కడా తాడిచెట్లు లేవు. కొన్ని మైళ్ళవరకూ దాదాపు నలభై మైళ్ళవరకూ లేవు. ఎప్పుడో భీముడికీ — ఘటోత్కచుడికీ జరిగిన యుద్ధంలో తాటిచెట్లు పీకి యుద్ధం చేశారనీ — అందుకనే తాటిబోదె కనబడదనీ ప్రతీతి. ఒకటిరెండు చెట్లున్నా తాటికల్లైనా ముట్టుకోరు. అది పాపంట. ఊరుబయట వాళ్ళు తెలియకుండా త్రాగి యెగురుతారు. కొందరుమాత్రం యిళ్ళలోనే త్రాగుతారు. త్రాగుడుకు ఆడా మొగా విచక్షణలేదు. బాలింతలు నొప్పులు మరిచిపోవటంకోసం కల్లు త్రాగిస్తారు. చెరువుకింద పంట. నారు నాటడం గానీ పల్చగా ఎరువులు చల్లటంగానీ వాళ్ళకు క్రొత్త. చిన్న చిన్న మళ్ళు చేసి గింజలు చల్లేస్తారు. అవే మొలుస్తై, పెద్దవౌతై. ఎరువు కుప్పలు కుప్పలుగా పోస్తారు. నాగరికతెంత అధ్వాన్నంగా ఉండంటే యెద్దుగానీ — దున్నగానీ లేని చిన్న చిన్న రైతులు. పెళ్ళాలచేతే యేతాములు లాగిస్తారు. బియ్యంమటుకు పసందుగా రుచిగా ఉంటై.

ఇలాంటి వాతావరణంలో భూములుకొని లక్ష్మిని కట్టివేద్దామని ముందు వచ్చిన నాలుగు కుటుంబాలకూ, ఆరు నెలలు దాటేటప్పటికి యింకొక ఆరు కుటుంబాలొచ్చి చేరినై. భద్రయ్యకు వ్యవసాయపు సుళువు మెలికలు తెలియవు. అతను చిన్నతనంనుంచీ నాటకాలనీ, బూటకాలనీ తిరిగి డబ్బు ఖర్చుచెయ్యటం తప్ప, కానీ సంపాయించి ఎరగడు. అందుకనే శోభనాద్రిని కూడా వెంబడి పెట్టుకొచ్చాడు. శోభనాద్రికి వ్యవసాయం కొట్టినపిండి. పదిళ్ళూ లేచినై. వాటికెదురుగా పొందికగా రోడ్డు వేసుకొన్నారు. రోడ్డు కిరుప్రక్కలా చెట్లు నాటారు. వ్యవసాయం సాగించారు. వేసవిలో చెరువులో నీళ్లు తగ్గిపోతై. రెండోపంట యెక్కువగా కాదు. జొన్న వేసినా యేపుగా రాదు. ఊళ్ళో నలుగురూ యీ పదిళ్ళంటే ఒకవింతగా చూసేవాళ్ళు. ఊళ్ళో స్కూలులేదు. ఆసుపత్రిలేదు. పదిమైళ్ళు పోతేగాని యేమీ దొరకవు. 'కాయగూరలూ, పాలు పెరుగూ అతిచౌక. కలలో కూడా తలచరానంతచౌక. కోస్తా జిల్లాలనుంచి వచ్చిన పదిళ్ళతాలూకు ప్రజలూ — దొడ్లో వంకాయలూ, పొట్లకాయలూ పెట్టారు. మిరపలు పొలాల్లో వేశారు. తలా ఒక గేదెను జతియెడ్లనూ కొనుక్కొచ్చారు. శోభనాద్రి సుళువూ, వసూళ్ళు చూచి మంచివాటిని యేరి తీసుకొచ్చాడు. భద్రయ్య పొలంపనిలో చెయ్యి చేసుకోవటం మొదలు పెట్టాడు. మొదటిసంవత్సరం పంట బాగానే ఐంది. ధర నిలబడింది. రెండోసంవత్సరం సాంతం నష్టమే వచ్చింది. భద్రయ్య చేతిలో కొంత పైకం నిలవుండటాన శోభనాద్రీ భద్రయ్యలు నిలవదొక్కుకొన్నారు. మిగతా సంసారులు పాతికెకరమో, అరయెకరమో, అమ్ముకొంటేగాని సంవత్సరం గడవలేదు. నైజాం పద్ధతిని పంటవేశినవాళ్ళకు నష్టమేం రాలేదు. కూలిఖర్చులకుపోను, కొద్దో గొప్పో యింటికి తోలుకొచ్చుకొన్నారుకూడాను. ఊళ్ళో చాలామంది కోస్తాజిల్లావాళ్ళ వ్యవసాయాన్ని గురించి ఎగతాళిచేయ నారంభించారు.

శోభనాద్రి అంత పెటపెటల్లోనూ తన పెద్ద కూతురిని కృష్ణాజిల్లాలోనే యిచ్చాడు. ఆ సంవత్సరం అంత పంట పండకపోయినా — యింకో పది కుటుంబాలు ఆ ఊరొచ్చి వలస యేర్పరుచుకొన్నై. ఊరుబయ టింకొక ఊరు తయారౌతున్నది. వీళ్ళని చూచి ఊళ్ళోవాళ్ళు నవ్వనారంభించారు. "యూనియన్ వాళ్ళు తెలివిగలవాళ్ళంటారే — యిదేం తెలివి యెవసాయాళ్ళు. కొండ నేలకుగూడా యెకరం రెండొందలు మూడొందలకు కొంటున్నారు — మట్టి బొక్కుతారులే." అనుకొన్నారు. షావుకారు రామలింగయ్య ఊళ్లోవాళ్ళ కొక ధరకూ ఊరిబయటివాళ్ళ కొక ధరకూ సరుకు లివ్వసాగాడు. ఊళ్ళో ఒక్క మంచినీటిభావీ లేదు. చెరువునీరు త్రాగటానికి బాగుండదు, ఊరిబయట — దాదాపు మైలుదూరం పోతేగాని మంచినీళ్ళు దొరకవ్. అక్కడ చిన్న వాగొకటుంది. అవే గ్రామానికంతకూ మంచినీళ్ళకి. చిన్న చిన్న బళ్ళందరికీ ఉన్నై. వాటిమీద పీపాలు వేసుకొనిపోయి రెండురోజులకు సరిపోయేటట్లు తెచ్చుకొంటారు. ఊరిబయటవాళ్ళకి వేం సరిపడలేదు. రోజులో సగభాగం మంచినీళ్ళు తెచ్చుకోవటానికే సరిపోతే...... 'ఇరవైయి'ళ్ళవాళ్ళం కలిసి భావి త్రవ్వించుకొందాం అన్నాడు శోభనాద్రి. భద్రయ్య తలూపాడు, గుంటూరుజిల్లానుంచి వచ్చిన వెంకటేశ్వర్లుమాత్రం — "మనం త్రవ్వే భావిలోమాత్రం మంచినీళ్ళు పడతైయని నమ్మకమేమిటన్నాడు. మంచినీళ్ళు పడకపోతే యింట్లోకీ, చెట్లకూ, పాదులకు

నీళ్లు తోడుకోవచ్చన్నారంతా. ఆరోజునే వెంకటేశ్వర్లను సికింద్రాబాదు పంపించటానికి నిశ్చయమైంది.

భావి త్రవ్వటం పూర్తైంది. నీళ్లు బాగా ఊరినై. శోభనాద్రి మొదటి బొక్కెనడు నీళ్ళు బయటకులాగి ఓ గుక్కెడు నోట్లో పోసుకొన్నాడు. అందరూ అతని ముఖంవంకే చూస్తున్నారు. ఎగిరి గంతేసి 'పంచదారలాగున్నై బాబాయ్' అన్నాడు. అందరి ముఖాలలోనూ ఆనందం తాండవమాడింది. ఈ వార్త ఊరందరికీ క్షణంలో తెలిసిపోయింది. సంవత్సరం గిరుక్కున తిరిగింది. నిజాంసాగరు ప్రాజెక్టుప్రాంతంలో చెరుకు కెక్కువ కాసాగింది. బోధన్ ఫ్యాక్టరీకి సప్లై ఎక్కువగా కావలసివచ్చింది. చెరువులక్రింద చెరుకు వేశారు ఊరిబయట వాళ్లు. తాముంటున్న ప్రాంతానికి 'క్రొత్తపేట' అని పేరుపెట్టుకొన్నారు. దొడ్లో చెల్లసాగుల్లోనే గాక వరిపొలంలో చెరుకు తోటల్లో లక్ష్మి నాట్యమాడింది. హైదరాబాదునించి ట్యూషను మాష్టరును పిలిపించి పిల్లలకు తెలుగు చెప్పించనారంభించారు అతను బి ఏ దాకా చదువుకొన్నవాడు. అతనొచ్చిన తర్వాత యింకా ఒకరిద్దర్ని రప్పించి చిన్న స్కూలు మొదలుపెట్టారు. ఆ స్కూలుకు పాకవేశారు. హెడ్మాష్టరు పేరు రామారావు. రామారావుకు హోమ్యోపతి వైద్యం కొద్దిగా తెలుసు. 'డీన్స్ మెడికల్ చెస్ట్' — హోమ్యోపతీ మందుల పెట్టొకటి తెచ్చాడు. స్కూలుకు ఊళ్లో పిల్లలు కూడా రాసాగారు. రోజూ ఓ ఏభైమంది పోరగాళ్లు (కుర్రాళ్లు) వచ్చేవాళ్లు. వాళ్ళకు తెలుగు, హిందీ, ఉరుదూ చెబుతుండేవాళ్లు. ఉదయంపూట రామారావు చిన్న చిన్న రోగాలకు మందులిస్తుండేవాడు. అతని సంసారభారం అతని దొక్కెడిదీ గాక- 'క్రొత్తపేట' మొత్తానిదైంది.

చెరుకుధర బాగా పెరిగిపోయింది. శోభనాద్రీ భద్రయ్యా చెరొక పదెకరాలూ కొన్నారు. వీళ్ళ ఐశ్వర్యం చూసి జనార్దనరెడ్డికీ, వహీదాలీకి కళ్లు కుట్టినై. స్కూలు పాకవేసిన స్థలం గ్రామానిదనీ, దాంట్లో పాకవేయటం నైజాం నవాబుగారి అధికారాన్ని ధిక్కరించటమనీ కుడినుంచి ఎడమకు (ఉర్దూ) దరఖాస్తు పెట్టారు. తహశీల్దారుగారు వచ్చి భద్రయ్యకు కబురంపాడు. బెదురుతూ భద్రయ్య పోయి దర్శనం చేసుకొన్నాడు. భద్రయ్యను తహశీల్దారుగారు పిలిపించారని తెలిసి రామారావు పరుగెత్తుకొంటూ వెళ్లాడు. అతను ఉర్దూలో గూడా ధారాళంగా మాట్లాడగలడు. అభియోగమంతా విని ఏమి చెప్పటానికీ తోచక రామారావువంక చూశాడు భద్రయ్య. రామారావు ఉన్న విషయమంతా విన్నవించుకొని "పీకి పారెయ్యమంటే రేపొద్దునకు పీకేయిస్తాను కాని పిల్లలచదువుపాడైపోతుంది" అన్నాడు. తహశీల్దారుగారు తల పంకించి మెదలకుండా చక్కాపోయారు. అటు జనార్దనరెడ్డీ—యిటు భద్రయ్య, ఆయనేం చేస్తాడోనని తహతహతో - భయంతో కూడుకొన్న బాధ ననుభవించారు.

రోజులు గడిచిపోయాయి.

* * *

ఒకరోజు తెలవారింది. క్రొత్త పేటలో అందరూ బద్ధకంగా నిద్రలేచారు. స్త్రీలు గొడ్ల కొట్టాలలోనుంచి పేడతెచ్చి కళ్లపి చల్లుతున్నారు. పిల్లలు రకరకాలైన పుల్లలు నోట్లో పెట్టుకొని పండ్లు తోముతున్నారు. భద్రయ్య లేచి ఊరి బయటకు వెళ్ళాడు. శోభనాద్రి అరుగుమీద కూర్చొని ముఖం కడుగుతున్నాడు. వహీదాలీ పొలంవైపుకు వెళ్ళిపోయాడు. అతను వెళ్లిపోయిన తర్వాత తిరిగి వస్తున్న భద్రయ్యకు దూరాన నురుగులు కక్కుకొంటూ వస్తున్న రామారావు కనిపించాడు. స్వేద బిందువు లతని ముఖానికొక క్రొత్తకళ నిస్తున్నై. దగ్గరకొచ్చి నిల్చున్నా అతని నోట మాటరాలేదు. ఆరోజు రాత్రే రజాకార్ల దుండగాలారంభమైనై నిజామాబాదు జిల్లాలో కూడా అలజడి చెలరేగింది. ఓ కుగ్రామంలో ఓ రెడ్డిని చిత్రవధ చేశారు దేశ్ ముఖ్ లలో అలజడి బయలుదేరింది. రైళ్లు పీనుగుపెంటలైనై ప్రాణమానాలకు కాపుదల లేదు ఆ వార్త తీసుకొచ్చాడు రామారావు.

ఆ రాత్రే జనార్దనరెడ్డి ఊరువిడిచి పారిపోయాడు. మళ్ళీ తెల్లవారింది. మామూలుగా వహీదాలీ ఊరి చివర కనిపించాడు. అంతా లేచి నిల్చొన్నారు. ఈనాడు వహీదాలీ ముఖంలో క్రౌర్యం ఉట్టిపడుతున్నది. దూరంనుంచే వెగటుగా అందరి వంకా చూడనారంభించాడు. గడ్డం సవరించుకొన్నాడు. భద్రయ్య ఇంటివద్దకువచ్చి ఒక్కక్షణం ఆగిపోయాడు. "భద్రయ్యా బాగా ఉన్నావా?" అంటూ అసహ్యంగా నవ్వాడు. భద్రయ్య తలవంచి తల ఊపాడు. మధ్యాహ్నానికి వింత వింత వార్తలొచ్చి చేరసాగినై. నిజామాబాదులో స్త్రీలు చెరచబడ్డారని......ఈ ఊళ్ళో ఒక్కక్షణం ఉండటం మంచిది కాదన్నాడు రామారావు. "మా ఊరిదేగా?" అన్నాడు శోభనాద్రి. ఎన్నో తర్కవితర్కాలు జరిగినై చివరకు భద్రయ్య, రామారావు, పిల్లా జెల్లా అంతా బెజవాడ వెళ్ళిపోవాలని నిర్ణయించబడింది. వెంకటేశ్వర్లు శోభనాద్రి ఉండిపోయారు—పొలం పనులకోసం. అరగంటలో క్రొత్తపేట ఖాళీ ఐపోయింది.

విజయవాడవెళ్ళే ప్యాసింజరులో జనం క్రిక్కిరిసి పోయారు. రైలు పెట్టెలమీదా, ఫుట్‌బోర్డుల మీదా ఖాళీ లేకుండా కూర్చొన్నారు. ప్రపంచంలోని జనమంతా యీ రైలులోనే ప్రయాణం చేస్తున్నట్టున్నది. ఎటు చూసినా భయ సందేహాలే. కళ్ళల్లో గాబరా. కాళ్ళూ చేతులూ నీరసించిపోతున్నై. ఏక్షణాన ఏ నరరూపరాక్షసుడు మీదపడి—ఏంచేస్తాడోనన్న పిరికితనం నరనరాల ఆ మానవసందోహంలో కనిపిస్తున్నది. శరీరమంతా ముచ్చెమటలు పోసినై. ఒకరిద్దరు 'రజాకార్' అన్న మాట గొణుగుకొన్నారు కూడా. రైలుగూడా బెరుకు బెరుకుగా బయలుదేరింది. ఆ బెరుకుతనంతో గంటసేపు ప్రయాణంచేసింది.

అంతే జనగామ దాదాపుకు రాకమునుపే రైలాగిపోయింది. పెట్టెలపైకెక్కినవాళ్ళు ఒక్కసారి క్రిందకుదూకారు. మొలలోఉన్న బాకులు బయటకు తీశారు. అందులో ఒకతనిదగ్గర రివాల్వరుకూడా ఉంది. చెట్లచాటులనుంచి మరికొందరు రజాకార్లు వచ్చారు. అంతా ఇంద్రజాలంలా జరిగిపోతున్నది. ఎదురొచ్చిన మగవాడల్లా యమసదనానికి తరలిపోతున్నారు. ఎటుచూచినా ఆర్తనాదాలు హాహాకారాలే. కలియుగాంతపు విలయం లాగుంది; కొద్ది క్షణాలు గడిచిపోయినై. భద్రయ్యావాళ్ళూ ఉన్న పెట్టెలోకి రజాకార్లు, రౌడీలు, గుండాలు ప్రవేశించారు. పసిపిల్లలూ తల్లులూ బిగ్గరగా యేడ్వనారంభించారు. పదినిముషాలు, పదేనిముషాలు చేతులు విరిచికట్టబడ్డ భర్తలకెదురుగా అందరి భార్యల మానహరణము జరిగిపోయింది. తరువాత కసిదీర భర్తల హృదయాల్లోకి కత్తులుపొడిచారు. ఆడవాళ్లు శవాల్లా నేలమీద పడిపోయారు. ఆ రాక్షసులవాంఛ లంతటితో తీరలేదు. శవాల్లాంటి ఆ శరీరాలమీదపడి దొర్లారు. బుగ్గలు కొరికారు. కొన్నిగంటలు నరకం భూలోకంలోకి తరలివచ్చింది. మళ్ళీ తరలిపోయింది తుపానువచ్చి తగ్గిపోయినప్పటి వాతావరణం చల్లగా ఉంటుంది. ఈ వాతావరణం కలకత్తాకాళి నృత్యం చేసిన వాతావరణం. ఇక్కడ అసహాయంగా అమానుషంగా చంపబడిన భర్తల శవాలు- అదే శ్మశానవాటిక.

* * *

పోలీసు యాక్షన్ జరిగింది. హైదరాబాదు యూనియన్‌లో కలిసింది. రజాకార్ల గుండగాలకెందరో బలైపోయారు. కోస్తాజిల్లాలలో తలలు దాచుకోవటానికి వెళ్ళిన ప్రజానీకం మళ్ళా స్వగ్రామాలు చేరుకొంటున్నవి. ఎక్కడ అలజడి అక్కడ అణిగిపోయింది. కాని భద్రయ్య జాడకానీ తలిమ్మావాళ్ళ జాడకానీ యిటు శోభనాద్రికీ—అటు బంధువులకూ తెలియలేదు.

ఒకనాటి మధ్యాహ్నం శోభనాద్రి పొలంనుంచి యింటికివచ్చాడు. తక్కిన పొలాలన్నీ బీళ్ళుపడినై. శోభనాద్రివెంకటేశ్వర్లూ చేసిన ఇరవై ఎకరాలు బాగా పండినై. రజాకార్లు ఎప్పుడొచ్చిపడతారో! వాళ్ళెక్కడున్నారో ఎవరికీ తెలియదాయె అసలు యితర ప్రపంచ మెలావున్నదో తెలీదు. ముందు గుండెదిటవు చేసుకున్నాడుగానీ—శోభనాద్రి హృదయం కూడా కొన్నిరోజులు జరగగానే బీటలువారసాగింది. పిల్లాజెల్లా కులాసాగా చేరారో లేదోనన్నబాధ కలచసాగింది. ఊళ్ళోకూడా ఒకటిరెండు తురకలిళ్లు గోలచేశినై. ఏదో హడావుడి కంఠానికురిపడ్డప్పటి వాతావరణం గొంతుమీదికత్తిలాంటి భావాలు ఆలోచనలు. పంట యింటికివచ్చింది. అది దక్కుతుందో లేదో జనార్దనరెడ్డి కుటుంబం ఐపులంపలేదు. వహీనాలీ కోరమీసాలు మెలివేస్తూ నవ్వుతుండేవాడు.

శోభనాద్రి నాలుగుమెతుకులు తిని నంచం వాల్చి కూర్చుని వెంకటేశ్వర్లుకోసం ఎదురుచూస్తున్నాడు. అతనెంతసేపటికీ రాలేదు. ఓగంటసేపుగడిచిపోయింది. అతనింక ఓర్చుకోలేకపోయాడు. తలుపు తాళంవేసి పొలంవైపుకు నడక సాగించాడు. ఇంటిదగ్గర పంటే మాతుందోనని గుండెల్లో భయంగానేవుంది. చెరుకు ఏపుగానేఐంది. కూలీలుదొరక్క కోయించటానికి వీలుపడలేదు. పదిగజాల మెరకలో చిన్నగుడిసె వేసున్నది. దాన్ని దూరాన్నుంచేచూశాడు శోభనాద్రి మనుష్యసంచార మేమీ కనిపించటంలేదు. బాగా దగ్గరగా. వచ్చేశాడు. గట్టుక్రింద వెంకటేశ్వర్లు స్పృహతప్పి పడిపోయున్నాడు తల రక్తంలో ఓలలాడుతున్నది. ధోవతినిండా రక్తం మరకలైనై. రెండోపంట వరికి వేసిన మడి కచాపచా మనుష్యులు త్రొక్కినట్లయింది చెరుకుతోటలో కొన్నిగడలు ఆదరాబాదరా కోసుకుపోయినచాయలు కనుపించినై శోభనాద్రి కేమీ అర్థం కాలేదు. జరిగిందేమిటో ఊహించుకోలేకపోయాడు పైపంచతీసి వెంకటేశ్వర్లు తలకుకట్టాడు. అతను బాధగామూల్గి కళ్లు మూసుకున్నాడు. బలమైన తన హస్తాలతో పసిపిల్లాడినెత్తుకున్నట్లు వెంకటేశ్వర్లును వీపున వేసుకొని గట్టునపడి యింటికి తీసుకొచ్చాడు శోభనాద్రి.

గుంటూరుజిల్లానుంచివచ్చి కొత్తపేటలో నివాసమేర్పరచుకున్న పుల్లయ్య తిరిగివచ్చి అరుగుమీద కూర్చొనున్నాడు. నిర్జీవంగాఉన్న కొత్తపేట అతని కాహ్వానమిచ్చింది. ఊళ్ళోనూ యిప్పుడిప్పుడే జనం

వచ్చి చేరుతున్నట్లున్నది. పుల్లయ్య బాగా చిక్కిపోయాడు. అతనిలో మునుపటి ఉత్సాహం కనిపించటంలేదు. శోభనాద్రినీ అతని భుజంమీదున్న వెంకటేశ్వర్లును చూచి అతను బావురుమన్నాడు. వెంకటేశ్వర్లును మంచం మీద పడుకోబెట్టి 'పుల్లయ్యా సంగతు లేమిటి' అన్నాడు శోభనాద్రి. పుల్లయ్య గొంతు పూడుకుపోయింది. శ్రావణమేఘాలు అతని ముఖంలో నాట్యమాడినై. బొంగురుపోయిన గొంతుతో జరిగినకథ చెప్పాడు. క్రొత్తపేట వాస్తవ్యుల్లో తనూ తన కొడుకూ తప్ప యింకెవ్వరు మిగలలేదన్నాడు. అగ్నిలో సమిధల్లా అంతా బుగ్గయినారన్నాడు. భావరహితమైన ముఖంతో శోభనాద్రి తన భార్య బిడ్డల మానభంగ చరిత్ర-చివరకు వాళ్లల్లా చిత్రవధ చెయ్యబడిందీ విన్నాడు. తన ప్రాణతుల్యుడైన భద్రయ్య సకుటుంబంగా ఎలాచనిపోయిందీ విన్నాడు. కనుకొలకుల్లో రెండు కన్నీటిబిందువులు నాట్యంచేసినై. మసిపట్టి గాలి కారిపోయిన దీపపుకళపడ్డ దతనిముఖానికి. ఒక్క గుటక మ్రింగాడు-ఇంతలో లోపల వెంకటేశ్వర్లు 'అమ్మా' అని మూలిగాడు.

ఆ ఊళ్ళోజరిగిన రజాకార్ల గుండెగమని చెప్పకో తగినది చెరు కపహరణ వెంకటేశ్వర్లు తలపగలడం. అందరితో పాటు జనార్దనరెడ్డీ తిరిగివచ్చాడు. క్రొత్తపేటలోనుంచి మాత్రం ఆశాజ్యోతి తరలి పోయింది. గాఢాంధకారంలో - అనంతవిశ్వంలో తడువుకులాడే వ్యక్తిలాగైనాడు శోభనాద్రి. పెద్దకూతురు దగ్గరనుండి ఉత్తరం వచ్చింది తమ క్షేమసమాచారాలు తెలియ చేయమని. ఊళ్ళోకి వచ్చిన రెండోరోజున జనార్దనరెడ్డి-శోభనాద్రికి కబురంపాడు. శోభనాద్రి మనసు పరిపరివిధాలపోయింది. కారణరహితంగా రెడ్డి తనను పిలిపించడు. రెడ్డి యెన్నడూ చూపని ఔదార్యం గౌరవం చూపించాడు. కుర్చీలో కూర్చోబెట్టి సానునయంగా సానుభూతి చూపించాడు. 'చీకటి శాశ్వతమా. వెలుగు ఏనాడో ఓనాడు రాక తప్పదన్నాడు. చివరకు తన పొలంలో ఐదెకరాలు అమ్మజూపాడు. శోభనాద్రి ఆలోచనలోపడ్డాడు. భూమిలో సారంలేక కాదు. రెడ్డి హయాంలో అదుపు అజా కనుక్కోక పోవటమే. ఎవరూ అభూమికొనరు. భద్రయ్య బ్రతికుండగా అనేవాడు. 'శోభనాద్రీ-నీ చేతిలో బడితే కొండరాళ్లైనా నల్లరేగడి కావలసిందే.' శోభనాద్రి భూమి తీసుకోవటానికి నిశ్చయించుకొన్నాడు. అవసరంకొద్దీ రెడ్డి రెండొందలుతక్కువకే ఖరారు చెశాడు. క్రుంగిపోయిన మనసుతాలూకు గట్లు-క్రొత్త ఆశనే పాటి దిబ్బలతో పైకి లేస్తుండగా జనార్దన రెడ్డి యిల్లువదిలాడు శోభనాద్రి.

నెల తిరుగకమునుపే క్రొత్తపేట అనేక క్రొత్త ముఖాలు వచ్చి వెళ్ళనారంభించినై. బంధువులేమైనారో తెలుసుకోవడానికి కొందరూ క్రొత్తగా వలస వస్తున్నవాళ్లు కొందరూ. శోభనాద్రి తాలూకు బంధువులు ఓదార్చటానికి వచ్చినట్లు వచ్చి 'నీకేంరా వయసుముల్లిందా?' — ఏమన్నానూ—నా మేనమామకూతురు యెదిగినపిల్ల—రత్నంలాంటిదుంది." అని తరచి—తరచి మనసులోది వెళ్ళగక్కి సలహాలూ అనునయాలూ పూర్తిచేసి వెళ్లిపోయారు. వాళ్లే బాధపడలేకనైతేనేం—మళ్ళీ పెళ్లి చేసుకుందామనే కాంక్ష మనసులో ఏ మూలో రేగడానైతేనేం శోభనాద్రి ఆరు సంవత్సరాల తర్వాత తాతల, తండ్రుల గ్రామం బయలుదేరాడు.

ఊరంతా మారిపోయింది. తాను వలస వెళ్లిన నాటి ఊరుకాదిది. ఊళ్ళో హైస్కూలు పెట్టారు. కంకరరోడ్లు వేశారు. ఐదారు హోటళ్లు లేచినై. మునసబుగారు నిరుడు చనిపోయాడు. అతని కుమారుడు మేడగట్టాడు. ఆ ఊరిమీదెందుకో శోభనాద్రికి కినుకగానే ఉన్నది. అది ఒకప్పుడు తన స్వగ్రామమన్న సంగతి కూడా మరిచిపో ప్రయత్నించాడు. ఈ ఊళ్లో తను చెల్లనిరూపాయైనాడు. క్రొత్తపేట తనకు విలువ కట్టింది. లక్ష్మిని తనవాకిటిముందు కట్టివేసి నాట్యం చేయించాడు. క్రొత్తపేట తను త్రాగేనీళ్లు-తన కూడు—తను. ఆ సాయంత్రమే బయలుదేరి పెద్దకూతురిగారింటికెళ్లిపోయాడు. కూతురు పరిస్థితేమంత బాగుండలేదు. ఆ ఊళ్ళోకూడా ఒకరిద్దరు తనకు పిల్లనిస్తామని వచ్చారు. శోభనాద్రి మనసులో ఏదో పురుగు తొలిచింది. పెళ్లి చేసుకోకూడదని నిశ్చయించుకొన్నాడు.

పదిరోజుల తర్వాత కూతురూ అల్లుడితో సహా క్రొత్తపేట పొలిమేరలో అడుగుపెట్టిన శోభనాద్రి హృదయంలో అవ్యక్తమైన ఆనందం పూలుపూసింది. మామగారి దగ్గరుండిపోవటాని కల్లుడంత అడ్డుచెప్పలేదు. ఊరింకా మైలుదూర ముండగానే కచ్చడం (బండి) లోనుంచి దిగి శోభనాద్రి చుట్టూతా పెరిగిన చెరుకుతోటలూ—దూరాన బంగారు తునకల్లాగా మిసమిసలాడుతున్న వరికంకులు చూచి పరవశత్వంతో ఓ క్షణం కళ్లుమూసుకొని ప్రకృతి అందాన్ని లావణ్యాన్నీ చూచి అబ్బురపడి పుస్తెకట్టాడు మనసులో. కూతురూ అల్లుడూ డేబిగా అతనివంక చూస్తూ ఉండిపోయారు.